సాక్షి
నిజామాబాద్

ఆదివారం । 7 । జనవరి । 2024



పక్కాగా జరగాలి

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పకడ్బందీగా జరగాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



వ్యాపారంగా మారిన వైద్యం

వైద్యాన్ని వ్యాపారంగా మార్చేసిన వైద్యులు తమకు సహకరిస్తున్న పీఎంపీలు,ఆర్‌ఎంపీలకు టూర్ ప్యాకేజీలిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.1 /18.3

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వరద కాలువ ద్వారా నీటి విడుదల



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ అధికారులు వరద కాలువ ద్వారా శనివారం నీటిని విడుదల చేశారు. కాలువ ద్వారా 2వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. వరద కాలువ ద్వారా యాసంగి సీజన్‌లో కూడా కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టడం ఇది రెండోసారి. కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 480 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 247 క్యూసెక్కులు, ఎత్తిపోతల పథకాల ద్వారా 312 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 600 క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 384 క్యూసెక్కుల నీరుపోతోంది.

టీజీసెట్ ప్రవేశ పరీక్ష పోస్టర్ల ఆవిష్కరణ



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాలల్లో 2024–25కు గాను 5వ తరగతిలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష టీజీసెట్–2024 దరఖాస్తు గడువును ఈనెల 20వరకు పొడిగించారు. శనివారం రాత్రి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు చేతుల మీదుగా గురుకుల ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో ఉన్న సాంఘిక సంక్షేమ, ఇతర గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఇందుకోసం ఈనెల 20వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. సంస్థ వెబ్‌సైట్ www.tswreis. ac.inను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిజామాబాద్ ప్రాంతీయ సమన్వయాధికారిణి అలివేలు, జిల్లా సమన్వయాధికారిణి సంగీత, నవీపేట్ ప్రిన్సిపల్ డి.రాగలత తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌లో పే..ద్ద చేపలు



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా తగ్గడంతో ప్రాజెక్ట్‌లో మత్స్యకారులకు చేపల వేట కొనసాగిస్తున్నారు. శనివారం ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన ఓ మత్స్యకారుడికి 20 కేజీల బరువైన పెద్ద చేప చిక్కింది. ప్రాజెక్ట్‌లో గరిష్ఠంగా 25 కేజీల చేపలు కూడా ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. మరో మత్స్యకారుడికి 10 కిలోల చేప చిక్కింది.

చట్టాలపై పోలీసులకు అవగాహన



ఖలీల్‌వాడి : గేమింగ్ చట్టాల నుంచి మోసాల వరకు ప్రథమ సమాచార సేకరణ నుంచి కోర్టులో చార్జ్ షీట్ వేసే వరకు జరుగుతున్న లోపాల గురించి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేష్ గౌడ్ శనివారం పోలీసులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, ఆదేశాల మేరకు శనివారం ఎక్సైజ్ కోర్టు హాల్‌లో పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూటర్ పి.లక్ష్మీనర్సయ్య, ప్రాసిక్యూటర్లు రహీమొద్దీన్, బంటు వసంత్, రాజారెడ్డి తదితరులున్నారు.

నేటి నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారంనుంచి అండర్–17 జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ ప్రారంభం కానుంది.



మాక్లూర్ మండలం మదనపల్లి శివారులోని సుభాష్ గార్డెన్స్

ఆధునిక పర్యాటకం

సండే స్పెషల్

ఆధునిక సమాజంలో తీరికలేని పనుల్లో మునిగిపోయినప్పటికీ.. ఏ కొద్దిపాటి సమయం చిక్కినా పచ్చని పల్లెల్లో.. స్వచ్ఛమైన గాలి పీల్చుతూ ఆనందంగా గడపాలని అందరూ కోరుకుంటారు. అయితే వినోదం కోసం అనేక పార్కులు కృత్రిమంగా ఏర్పాటు చేస్తున్నప్పటికీ అవన్నీ పెద్ద నగరాలు, మెట్రో నగరాల్లోనే నెలకొల్పుతున్నారు. అయితే ఇందుకు భిన్నంగా జిల్లాలోని మాక్లూర్ మండలం మదన్‌పల్లి శివారులో చుట్టూ కొండలు, పొలాల మధ్య పూర్తి గ్రామీణ ప్రాంతంలో, ఆహ్లాదకర వాతావరణంలో సుభాష్ గార్డెన్స్ పేరిట ఏర్పాటు చేసిన అమ్యూజ్‌మెంట్ పార్క్ అందరినీ అలరిస్తోంది.

- మాక్లూర్ మండలం మదన్‌పల్లిలో 45 ఎకరాల్లో ఫ్యామిలీ టూర్ జోన్
- చిన్నారులు, పెద్దలకు ఆహ్లాదాన్ని పంచుతున్న వాటర్ గేమ్స్
- ఉత్తర తెలంగాణలోనే ఏకైక వాటర్ గేమ్స్ జోన్
- మహారాష్ట్ర నుంచి కూడా తరలివస్తున్న విద్యార్థులు, పర్యాటకులు
- ఆగ్రో టూరిజం కోసం ఫామ్ స్కూల్ ఏర్పాటుకు ప్రయత్నం : కేసరి శ్రీనివాసరెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి కరీంగనర్, ఉమ్మడి ఆదిలాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలకు చెందిన అనేక పాఠశాలల విద్యార్థులకు, చిన్నారులకు, కుటుంబాలకు సుభాష్ గార్డెన్స్ ఆహ్లాదం పంచుతోంది. ఫ్యామిలీ టూర్ జోన్ మాదిరిగానూ ఉంది. నిజామాబాద్‌కు చెందిన కేసరి శ్రీనివాసరెడ్డి, స్వప్నరెడ్డి దంపతులు 2001 నుంచి నగరంలో సుభాష్ హెల్త్ క్లబ్ పేరిట జిమ్, స్విమ్మింగ్‌పూల్ నిర్వహిస్తున్నారు. అయితే నగరానికి దూరంగా అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేసేందుకు గాను 2003లో మదన్‌పల్లి వద్ద 45 ఎకరాలు కొనుగోలు చేశారు. ఇందులో మామిడి తోటలు, మలబారు వేప చెట్లు, సపోటా చెట్లు వేశారు. తరువాత వాటర్ గేమ్స్ కోసం వాటర్ స్లైడ్స్, డ్రై స్లైడ్స్, టవర్ స్లైడ్స్, ఫ్యామిలీ ప్లే స్టేషన్, మల్టీలేన్ రైసర్ స్లైడ్స్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా చిన్నారులు ఆడుకునేందుకు పార్కులు, ప్లే జోన్స్ ఏర్పాటు చేశారు. అయితే ఇందులో చిన్నారులతో పాటు పెద్దలు కూడా చిన్నపిల్లల మాదిరిగా మారిపోయి సేదతీరుతున్నారు. చుట్టూ కొండలు, పొలాలు ఉండడంతో ఇక్కడ వాతావరణం మరింత ఆహ్లాదకరంగా ఉంటోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో వెజ్ ఆహారం అందిస్తున్నారు.



పార్క్‌లో బొమ్మ





చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన వాటర్ గేమ్స్



వాటర్ గేమ్స్ స్లైడ్స్



స్వాగత తోరణం

ఎడ్యుటైన్‌మెంట్ కోసం..

విద్యార్థుల కోసం భవిష్యత్తులో ఇక్కడ ఆగ్రో టూరిజం.. ఫామ్ స్కూల్ ఏర్పాటు చేసి వినోదంతో కూడిన విద్యను అందించేందుకు గాను 'ఎడ్యుటైన్‌మెంట్' ప్రాజెక్ట్ కోసం ముందుకు వెళ్తున్నాం. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి కూడా పాఠశాల విద్యార్థులు తరలివచ్చేలా చేస్తున్నాం.

అదేవిధంగా జలాశయాల్లో మాదిరిగా సేఫ్ జోన్‌లో ఇక్కడే స్పీడ్ బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇక్కడికి ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాల నుంచి ఇప్పటివరకు 250కి పైగా పాఠశాలల విద్యార్థులు వచ్చి వెళ్తున్నారు. అదేవిధంగా బాసర సరస్వతి ఆలయానికి బస్సుల్లో వచ్చిన వారు సైతం మా గార్డెన్స్‌కు వస్తున్నారు.

– శ్రీనివాస రెడ్డి



డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం..

వాటర్ గేమ్స్‌తో కూడిన అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేసే తన డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం శ్రీనివాసరెడ్డి భారీ ఆదాయం ఇస్తున్న తన వ్యవసాయాన్ని వదులుకున్నారు. ఈ భూమిలో శ్రీనివాసరెడ్డి 2007 నుంచి 2010 వరకు 'డే బ్లూమింగ్ జాస్మిన్' మొక్కలను సాగు చేసి యూరప్, ఫిలిప్పిన్స్ దేశాలకు ఎగుమతి చేశారు. సోరియాసిస్ వ్యాధికి మెడిసిన్ తయారు చేసేందుకు ఈ మొక్కలు ముడిసరుకుగా ఉపయోగపడతాయి. 20 ఎకరాల్లో ఈసాగు ద్వారా రూ.1.5 కోట్ల ఆదాయం ఆర్జించారు. అదేవిధంగా ఏటా 50 వేల బ్యాగుల వర్మి కంపోస్ట్ తయారు చేసి విక్రయించారు. అయితే తన డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం లాభదాయక వ్య వసాయాన్ని శ్రీనివాసరెడ్డి వదులుకున్నారు. ఇక ప్రస్తుతం ఇందులో ఉన్న మామిడి చెట్ల నుంచి ఏటా 80 టన్నుల కాయలు ఆర్గానిక్ విధానంలో పండిస్తున్నారు. మలబారు వేప చెట్లను మొదటి కటింగ్ చేశారు.



సుభాష్ గార్డెన్స్‌లో మలబారు వేప చెట్లు

సంక్రాంతికి 50 ప్రత్యేక బస్సులు

- 11 నుంచి 14వ తేదీ వరకు..
- నిజామాబాద్ రీజియన్ నుంచి హైదరాబాద్‌కు..

ఖలీల్‌వాడి : సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక బస్సులను నడిపించేందుకు ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల్లో 615 బస్సులున్నాయి. ఈ రీజియన్ నుంచి ఆర్టీసీ బస్సులను ఈనెల 11 నుంచి 14 వరకు సంక్రాంతికి బస్సులను తిప్పనున్నారు. ఈ రీజియన్ నుంచి 50 బస్సులను నిజామాబాద్–1, నిజామాబాద్–2, ఆర్మూర్, కామారెడ్డి, బోధన్, బాన్స్‌వాడ డిపోల నుంచి హైదరాబాద్‌కు నడుపనున్నారు. ఈనెల 11న తక్కువ మొత్తంలో బస్సులను ప్రారంభించనున్నారు. 12 తేదీ నుంచి 14వ తేదీ వరకు 50 బస్సులను క్రమతప్పకుండా నడిపించేందకు ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అత్యధికంగా ఆంధ్ర ప్రాంతాలకు చెందిన వారు నివాసముంటున్నారు. వారు సంక్రాంతికి వెళ్లేందుకు బస్సులు అందుబాటులో ఉంచనున్నారు.



ఈనెల 14న బోగి ఉండటంతో హైదరాబాద్ నుంచి ఆంధ్రాకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం ఉండటంతో అధికారులు అక్కడిదాకా నడుపనున్నారు. అలాగే రీజియన్ నుంచి రెగ్యులర్‌గా వెళ్లే గరుడ, రాజధాని, సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్‌లు నడుపనున్నారు.

రద్దీ తగ్గడం కష్టమే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఆరుడిపోల నుంచి ప్రతిరోజు ఆర్టీసీ బస్సుల్లో 2.60 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. ఇందులో 60శాతం మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారు. పండగకు గ తంలో అదనపు చార్జీలు వసూలు చేసేవాళ్లు ఆర్టీసీ ఎండీగా సజ్జనార్ వచ్చాక అదనపు చార్జీలను తొలగించారు.

ముగిసిన 'ప్రజాపాలన'

- ఆరు గ్యారంటీలపై 4,77,808 దరఖాస్తుల స్వీకరణ
- ఇతర సమస్యలపై 1,12,564 వినతులు
- వేగంగా సాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్

సుభాష్‌నగర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన అభయహస్తం కార్యక్రమం శనివారంతో ముగిసింది. డిసెంబర్ 28వ తేదీ నుంచి ఈనెల 6వ తేదీవరకూ ఆరు గ్యారంటీలకు సంబంధించి మొత్తం 4,77,808 దరఖాస్తులను స్వీకరించారు. ఇతర సమస్యలకు సంబంధించి 1,12,564 వినతులను సమర్పించారు. ప్రతి నాలుగు నెలలకొకసారి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపడుతామని సీఎస్ ప్రకటించిన విషయంతెలిసిందే. శనివారం చివరిరోజు ఆరు గ్యారంటీలపై 38,848 దరఖాస్తులు, ఇతర సమస్యలపై 17,474 వినతులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మున్సిపాలిటీల్లో కలిపి 676 ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఆయా కేంద్రాల పరిధిలో 4,05,049 నివాసగృహాలు ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 93,634 దరఖాస్తులు వచ్చాయి.



నగరంలో దరఖాస్తులు సమర్పిస్తున్న ప్రజలు

నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు..

ఆర్మూర్	56,814	బోధన్	58,931
బాల్కొండ	87,212	నిజామాబాద్ రూరల్	93,634
బాన్సువాడ	41,689		

మున్సిపాలిటీల వారీగా దరఖాస్తులు..

నిజామాబాద్	92,433	బోధన్	21,904
ఆర్మూర్	20,258	మొత్తం	4,77,808
భీమ్‌గల్	4,933		

909 మంది డీటీపీ ఆపరేటర్లు..

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జిల్లావ్యాప్తంగా అన్ని మండల, మున్సిపాలిటీ కేంద్రాల్లో కొనసాగుతోంది. శనివారంతో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. 909 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా నమోదు ప్రక్రియ చేపడుతున్నారు. రెండు షిఫ్టుల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు నమోదు చేయనున్నారు. శనివారం సాయంత్రం నాటికి సుమారు 48వేల పైచిలుకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో రాష్ట్రంలో మన జిల్లా మొదటిస్థానంలో ఉందని అధికారులు పేర్కొన్నారు. ఒక్కో ఆపరేటర్ ఒక షిఫ్టులో 40 నుంచి 50 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేలా శిక్షణనిచ్చారు. అధికారులు ఎప్పటికప్పుడు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 17వ తేదీ వరకు స్వీకరించిన 4,77,808 దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని గడువు నిర్ధేశించింది.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీ ధర్మపురి అర్వింద్

ఇందల్వాయి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, ఉజ్వల యోజన వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లిలో గ్రామసభలో ఎంపీ అర్వింద్ మాట్లాడారు. సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేసి క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ప్రజలు తమ గ్రామాలకు వచ్చే అధికారుల వద్ద అర్హులు పథకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంకల్ప యాత్రకు అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన సూచించారు. కేంద్ర పథకాలను వారికి వివరించాలన్నారు. సరైన రీతిలో స్పందించట్లేదంటూ ఎంపీడీవో రాములు నాయక్‌పై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండల బీజేపీ మహిళా అధ్యక్షురాలు సవిత తల్లి కొద్దిరోజుల క్రితం మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను సిర్నాపల్లిలో ఎంపీ పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చంద్రాయన్‌పల్లికి చెందిన బీజేపీ కార్యకర్త అనిల్ కుటుంబాన్ని పరామర్శించి రూ. చెక్కు అందజేశారు. బీజేపీ రూరల్ ఇంచార్జ్ కులాచారి దినేష్, డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, ఎంపీటీసీ చింతల దాసు, మండల అ ధ్యక్షుడు నాయిడి రాజన్న, గన్నారం సర్పంచ్ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కన్నె చిన్ను తదితరులు పాల్గొన్నారు.



తిర్మన్‌పల్లిలో సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీ అర్వింద్ తదితరులు

గ్యారంటీల అమలుకే 'ప్రజాపాలన'

రుద్రూర్ : కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకు అమలు చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావ్ ఆవేదన వ్యక్తం చేశారు. కోటగిరి మండలం కొత్తపల్లిలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన సభకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దరఖాస్తులకు రశీదు అందచేశారు. సభలో మంత్రి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. ఏడాదికి రూ. 40 వేల కోట్లు వడ్డీ చెల్లించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ వచ్చీరాగానే రెంగు గ్యారంటీలకు అమలు చేసిందన్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు వస్తేనే బిల్లు కట్టాలని పేర్కొన్నారు. పథకం నిర్వహణ సరిచేయాలని కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ 530 జీపీలు, 146 మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన సభలు సజావు గా జరిగాయన్నారు. దరఖాస్తుల ఆన్‌లైన్10రోజుల్లో పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతి, విండో చైర్మెన్ సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, డీపీవో జయసుధ, జిల్లా సహకార అధికారి సింహాచలం, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీడీవో మనోహరెడ్డి, తహసీల్దార్ ప్రభాకర్ తదితరులున్నారు.



రశీదు అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

క్లుప్తంగా

జాతీయ పోటీలకు విద్యార్థి ఎంపిక



ఎల్లారెడ్డి: జాతీయ స్థాయి పరుగుపందెం పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి ఈశ్వర్‌ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ ప్రవీణ్‌కుమార్‌ శనివారం తెలిపారు. ఇటీవల కామారెడ్డిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి బీహార్‌లో ని ర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థి ఈశ్వర్‌ను అధ్యాపకులు ప్రభాకర్‌, కృష్ణప్రసాద్‌, సిద్ధు, గంగారెడ్డి,వసంతలక్ష్మి పాల్గొన్నారు.

శరత్‌రెడ్డికి డాక్టరేట్‌ ప్రదానం



లింగంపేట: మండలంలోని బాణాపూర్‌ గ్రామానికి చెందిన శరత్‌రెడ్డికి డాక్టరేట్‌ను శ్రీరామానంద తీర్థ మరఠ్వాడ యూనివర్సిటీ నాందేడ్‌ వారు ప్రదానం చేశారు. మెదక్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా శరత్‌రెడ్డి పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశా లలో ప్రిన్సిపాల్‌, అధ్యాపకులు శరత్‌రెడ్డిని శనివారం ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల కళాశాలలో పొలిటికల్‌ సైన్స్‌, కంప్యూటర్‌ సైన్స్‌లో బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ ధనవేణి శనివారం తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 19న రాత పరీక్ష, డెమో ఉంటుందన్నారు. ఆసక్తి మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

వ్యాపారంగా మారిన వైద్యం

- రోగుల రక్తాన్ని పిండేస్తున్న వైద్యులు
- సహకరిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలకు టూర్లు, బహుమతులు
- తమకేమీ సంబంధం లేదంటున్న వైద్యారోగ్యశాఖ



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో వైద్యం వ్యాపారంగా మారింది. ప్రజలు వైద్యం కోసం ప్రైవేట్‌ ఆస్పత్రులకు వెళ్తే వారి జేబులు గుల్ల అవుతున్నాయి. పలు చికిత్సలు, వైద్యం పేరిట రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. వీరికి సహకరిస్తున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలను సంబంధిత యాజమాన్యాలు గోవా, పలు టూర్ల పేరిట సొంత ఖర్చులతో పంపిస్తున్నారు. అంతేకాకుండా పుట్టిన రోజు, పెళ్లి రోజు వేడుకలను ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలే ఘనంగా నిర్వహిస్తున్నాయి. విలువైన కానుకలు, బంగారాన్ని సైతం అందజేస్తున్నాయి. దీంతో ప్రైవేటు ఆస్రతుల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తూ రోగుల రక్తాన్ని పిండేస్తున్నాయి. ఇవన్నీ తెలిసిన వైద్యశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో పలు అనుమానాలకు దారిస్తోంది.

ఇదీ పరిస్థితి..

పల్లె, పట్టణాల్లో అయినా పేదోళ్లకు, మధ్యతరగతి కుటుంబాలకు జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, పలు ఆరోగ్య సమస్యలు ఏది వచ్చిన మొదటగా ఆర్‌ఎంపీ, పీఎంపీల వద్దకు వెళ్తారు. వారు ఇదే అనువుగా భావించి పలు రోగాల పేరిట భయభ్రాంతులకు గురిచేస్తూ వారు ఎంచుకున్న ప్రైవేటు ఆస్పత్రులకు పంపిస్తూ వారి జేబులు నింపుకొంటున్నారు.

వేడుకలకు బహుమతులు..

జిల్లాలో 500లకు పైగా ఆస్పత్రులు ఉంటే, నగరంలోనే 400వరకు ప్రైవేట్‌ ఆస్పత్రులున్నాయి. ఇందులో 50వరకు మల్టీ, సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రులున్నాయి. ప్రైవేట్‌ ఆస్పత్రులకు రోగులను రిఫర్‌ చేసినందుకు నిర్వాహకులు, కొంతమంది వైద్యులు ప్రతి నెలా ఆర్‌ఎంపీ, పీఎంపీలకు

కమిషన్‌లతో పాటు, అప్పుడప్పుడు విహారయాత్రల ట్రిప్పులను ఆఫర్‌ పేరిట పంపిస్తున్నారు. అంతేకాకుండా ఎక్కువ సంఖ్యలో రోగులను రిఫర్‌ చేస్తున్న కొంతమంది ఆర్‌ఎంపీ, పీఎంపీల బర్త్‌డే, మ్యారేజ్‌డే, గృహ ప్రవేశాలు, ఇంటి పండుగులకు, వారి పిల్లల వివాహాలకు తామే ఖర్చును భరిస్తూ విలువైన బహుమతులను అందజేస్తున్నట్లు సంబంధిత ప్రైవేట్‌ ఆస్పత్రుల యాజమాన్యాలే పేర్కొంటున్నాయి.

పట్టించుకోని వైద్యశాఖ

రోగం వస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియంత్రణ లేని ఫీజులతో అమాయకులైన రోగులు తమ ఇళ్లు, బంగారాన్ని అమ్మి ఫీజులు చెల్లిస్తున్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు సైతం ఫీజులు అధికంగా వసూలు చేస్తూ రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పల్లె, పట్టణాల్లో ప్రజలకు అన్ని రకాల వైద్యం చేస్తూ ఇంజెక్షన్‌, గ్లూకోస్‌లు పెట్టి మరీ మందులు ఇస్తున్నారు. గతంలో వైద్య శాఖ తనిఖీలు చేపట్టి కొన్ని ఆర్‌ఎంపీ, పీఎంపీ కేంద్రాలను మూసి వేయించింది. వైద్యశాఖలోని కొంతమంది అధికారులు మామూళ్లకు అలవాటు పడడంతో ప్రైవేటు ఆస్రత్రుల నిర్వాహకులు, ఆర్‌ఎంపీ, పీఎంపీల ఆగడాలు మితిమీరుతున్నాయి. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా వైద్య ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇంజెక్షన్‌ ఇవ్వకూడదు

ఆర్‌ఎంపీ, పీఎంపీలు రోగులకు ఫస్ట్‌ ఎయిడ్‌ మాత్రమే చేయాలి. ఇంతకు మించి ఎలాంటి వైద్యం చేయరాదు. ఇంజెక్షన్‌లు, మందులు ఇవ్వకూడదు. అయినా పేద రోగుల నుంచి డబ్బులు దండుకోవడానికి వచ్చిరానీ వైద్యం చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గతంలో చర్యలు తీసుకున్నాం. ఇప్పుడు మా చేతుల్లో ఎలాంటి అధికారం లేదు.

–సుదర్శనం, డీఎంహెచ్‌వో

ఆన్‌లైన్‌ నమోదును సమర్థవంతంగా నిర్వహించాలి

- అధికారులు పర్యవేక్షణ చేపట్టాలి
- బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి



ఆన్‌లైన్‌ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బోధన్‌టౌన్‌: ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయంలో, బీఈడీ కళాశాలలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్‌ నమోదు ప్రక్రియను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 72 వేల దరఖాస్తులు వచ్చాయని అన్నారు. అధికారులు ఆన్‌లైన్‌ నమోదు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ నెల 17 వరకు ఆన్‌లైన్‌ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని వీటి కోసం 180 కంప్యూటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

రైతు సంక్షేమమే ముఖ్యం..

రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్‌ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. రాకాసీపేట్‌లోని రైల్వే స్టేషన్‌లో డీఏపీ ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులపై అదనపు భారం పడకుండా ఉండేందుకు నేరుగా రైల్వే స్టేషన్‌ నుంచి డీఏపీ ఎరువుల సంచులను సొసైటీలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వీడి పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 360 మంది విద్యార్థులు ఉంటే మండలంలోని పెంటాకాలన్‌ ప్రభుత్వ పాఠశాలలో 36 మంది విద్యార్థులు ఉన్నారని ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వీడాలని సూచించారు. అనంతరం బీఈడీ విద్యార్థులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీవో రాజాగౌడ్‌, జేడీఏ వాజిద్‌ హుస్సేన్‌, మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ తూము పద్మాశరత్‌ రెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ ఖమర్‌ అహ్మద్‌, ఎంపీడీవో పర్బన్న, తహసీల్దార్‌ గంగాధర్‌, కౌన్సిలర్‌ మీర్‌నజీర్‌ అలీ, కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి, డీసీసీ తాహెర్‌బిన్‌ హందాన్‌, పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్‌, నాయకులు గంగాశంకర్‌, నరేందర్‌ రెడ్డి, నాగేశ్వర్‌రావు, పులి శ్రీనివాస్‌, నవీన్‌కుమార్‌, అమందర్ల రవి, అశోక్‌, దామోదర్‌ రెడ్డి, ఖలీం తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్‌ ఆపరేటర్‌పై సస్పెన్షన్‌ వేటు

రెంజల్‌: మండలంలోని తాడ్‌బిలోలి సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న చెరుకూరి ఆనంద్‌పై సస్పెన్షన్‌ వేటు వేసినట్లు ఎడపల్లి సబ్‌ డివిజన్‌ ఆపరేషన్‌ ఏడీ లక్ష్మణ్‌నాయక్‌ తెలిపారు. మద్యం మత్తులో విధులు నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలడంతో నివేదికను ఉన్నతాధికారులకు పంపగా బోధన్‌ డీఈ ముక్తార్‌ సస్పెండ్‌ చేస్తూ ఆదేశాలు జారీ చేశారని వివరించారు. గత నెల డిసెంబర్‌ 31న తాడ్‌బిలోలి సబ్‌స్టేషన్‌ పరిధిలోని బాగేపల్లిలో లైన్‌మెన్‌ మురళీ ఫోన్‌ ద్వారా ఎల్‌సీ(లైన్‌క్లియర్‌) తీసుకుని రైతుల సూచన మేరకు కాశాపూర్‌ శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌ను హెల్పర్‌ల సాయంతో బిగిస్తుండగా ఆపరేటర్‌ ఆనంద్‌ మద్యం మత్తులో బ్రేకర్‌ను చాలు చేయడంతో విద్యుత్‌ సరఫరా అయి పెద్ద ప్రమాదం తప్పిందని వివరించారు. స్థానిక రైతులు ఆపరేటర్‌కు ఫోన్‌ చేసి విషయాన్ని ప్రశ్నించగా మద్యం మత్తులో ఉన్న ఆపరేటర్‌ దురుసుగా సమాధానం చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎఫ్‌ఐఆర్‌ ఆధారంగా విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందించినట్లు పేర్కొన్నారు. విధులపై అలసత్వం వహించే ఆపరేటర్‌లను ఉపేక్షించేదిలేదని ఏడీ లక్ష్మణ్‌నాయక్‌ హెచ్చరించారు.

ప్లాస్టిక్‌ రహిత సమాజానికి కృషి చేయాలి



క్లాత్‌ బ్యాగులను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌

కామారెడ్డి క్రైం: ప్లాస్టిక్‌ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌ అన్నారు. కలెక్టర్‌ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన లైఫ్‌ స్టైల్‌ ఫర్‌ ఇన్నోవెంట్‌ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ వస్తువులను వాడవద్దని సూచించారు. ప్లాస్టిక్‌ వాడకంతో పర్యావరణం దెబ్బతింటుందని చెప్పారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటం కోసం విద్యార్థులు మొక్కలు నాటాలని సూచించారు.

ఈ సందర్భంగా క్లాత్‌ బ్యాగులను అదనపు కలెక్టర్‌ ఆవిష్కరించారు. కంపోస్ట్‌ ఎరువుల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో డీఈవో రాజు, జిల్లా సైన్స్‌ అధికారి సిద్ధరాం రెడ్డి, ఎన్జీసీ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్‌, రాష్ట్ర కోఆర్డినేటర్‌ శివకుమార్‌, రిసోర్స్‌ పర్సన్‌లు ప్రవీణ్‌ కుమార్‌, శ్రీధర్‌, ఎన్జీపీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌




డొంకేశ్వర్‌: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును రాష్ట్ర మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ మార గంగారెడ్డి శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ సత్యనారాయణ రెడ్డి, జీఎం విష్ణువర్ధన్‌ తదితరులు ఉన్నారు.

హాస్టల్‌ విద్యార్థులకు దుప్పట్లు అందజేత



దుప్పట్లు అందుకున్న హాస్టల్‌ బాలికలు

సుభాష్‌నగర్‌ : జిల్లాలోని వివిధ ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు తరఫున సంబంధిత అధికారులు శనివారం దుప్పట్లు అందజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చేవారు విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచేలా దుప్పట్లు, నోట్‌ బుక్కులు అందించాలని కలెక్టర్‌ చేసిన విజ్ఞప్తికి అనూహ్య స్పందన లభించిన విషయం విదితమే. ఈమేరకు బోధన్‌లోని ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్‌ బాలికల హాస్టల్‌, నిజామాబాద్‌, రెంజల్‌, డిచ్‌పల్లి, ఆర్మూర్‌ బీసీ బాలికల హాస్టల్‌ విద్యార్థినులకు, అర్గుల్‌ బీసీ బాయ్స్‌ హాస్టల్‌ విద్యార్థులకు దుప్పట్లు అందజేశామని జిల్లా బీసీ సంక్షేమ అధికారి రమేష్‌ తెలిపారు. అలాగే నోట్‌ బుక్కులు, పెన్నులను పదోతరగతి విద్యార్థులకు అందజేయనున్నామన్నారు.



క్రైం కార్నర్‌

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్‌)

లింగంపేట: మండలంలోని కొర్పోల్‌ గ్రామానికి చెందిన గాండ్ల ఆంజనేయులు(42) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్‌ శనివారం తెలిపారు. ఆంజనేయులు వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తుంటాడు. కుటుంబ పోషణ, పిల్లల చదువులకు అప్పు చేశాడు. కొంత కాలంగా అప్పులు ఎలా తీర్చాలో తెలియన బాధపడుతూ ఉండేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో అందరూ కలిసి భోజనం చేసి పడుకున్నారు. ఉదయం భార్య కృష్ణవేణి లేచి చూడగా పశువుల కొట్టంలో దూలానికి వేలాడుతూ కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు రాహుల్‌, కుమార్తె నవ్య ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడు..

రుద్రూర్‌: మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నీరేశ్‌ శనివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మెహిరే వినయ్‌ కుమార్‌(34) ప్రైవేట్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వినయ్‌కు కొన్ని రోజులుగా మద్యానికి అలవాటుపడ్డాడు. శుక్రవారం రాత్రి సైతం మద్యం తాగి గదిలో నిద్రించాడు. శనివారం మధ్యాహ్నం వరకు డోరు తీయకపోవడంతో అనుమానం వచ్చి పగులగొట్టి చూడగా వినయ్‌ ఉరేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీకి యత్నం



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని శివాలయం, రామాలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించినట్లు ఎస్సై శనివారం తెలిపారు. హుండీలను తెరిచేందుకు ప్రయత్నించినా తెరువక పోవడంతో వెనుదిరిగారు. ఆలయంలో ఎలాంటి నగదు, ఆభరణలు చోరీకి గురికాలేవన్నారు. క్లూస్‌ టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆరుగురి హత్య కేసులో సీన్‌ రీకన్‌స్ట్రక్షన్‌

ఖలీల్‌వాడి: మాక్లూర్‌ మండల కేంద్రంలోని మంగళి ప్రసాద్‌ హత్య కేసులో ప్రధాన నిందితుడితోపాటు మరో ముగ్గురితో పోలీసులు సీన్‌రీకన్‌స్ట్రక్షన్‌ శనివారం నిర్వహించారు. హత్య చేసిన ప్రాంతాలను పరిశీలించారు. నిందితులు ఉపయోగించిన గడ్డపార, పార తదితర వస్తువులు కొనుగోలు చేసిన షాపులోకి తీసుకెళ్లి విచారించారు. ఆరుగురు ఒకే కుటుంబానికి చెందిన వారిని హత్య చేయడం సంచలనం రేపింది.

అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడి అరెస్టు..?

ఖలీల్‌వాడి: నగరంలోని అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడిని టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అరెస్టుచేసి విచారిస్తున్నట్లు సమాచారం. నగరంలో ఓ పీఎస్‌లో నిందితుడిని అరెస్టుచేసి పెద్ద ఎత్తున మట్కాకు సంబంధించిన డబ్బుతో పాటు చిట్టీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సదరు నిర్వాహకుడితో ఆన్‌లైన్‌లో మట్కా ఆడినట్లు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు, పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ విషయమై సంబంధిత ఎస్సై, సీఐలను వివరణ కోరడానికి ప్రయత్నించగా వారు స్పందించలేదు. గతంలో కూడా ఇదే పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఐపీఎల్‌ బెట్టింగ్‌ నిర్వహిస్తున్న ఓ నిర్వాహకుడిని పోలీసులు, టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అరెస్ట్‌ చేసినప్పటికీ సీఐతో పాటు ఎస్సై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా చూశారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత



రెంజల్‌: మండలంలోని నీలా పెద్ద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్‌ తెలిపారు. పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పొక్లెయిన్‌ సీజ్‌



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీద్‌పేటలోని ఏడు తూముల చెరువు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీతో పాటు రెండు టిప్పర్లను శనివారం సీజ్‌ చేసి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్‌ జయంతిరెడ్డి తెలిపారు. గతంలో హెచ్చరించినా మళ్లీ మొరం తరలిస్తుండడంతో వాహనాలను సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ



భిక్కనూరు: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఏఎస్సై జగదీశ్‌ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌, కార్లు నడిపే వారు తప్పకుండా సీట్‌ బెల్ట్‌ ధరించాలని సూచించారు.

వీడీసీ సభ్యులపై కేసు నమోదు

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి గ్రామ కమిటీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. రజక కులస్తుల భూమిని వీడీసీకి ఇవ్వాలని లేకుంటే బహిష్కరిస్తామని బెదిరించడంతో 15 మంది వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులను వీడీసీలు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

8న ఉద్యోగ మేళా

నిజామాబాద్‌ నాగారం : జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్‌ రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 8న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్‌ తెలిపారు. డిగ్రీ, ఎంబీఏ, బీటెక్‌, బీఫార్మసీ, ఐటీఐ డిప్లొమా ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. వేతనం రూ.15 వేల నుంచి 25 వేలు, పీఎఫ్‌, ఈఎస్‌ఐ ఉంటుందన్నారు. వయో పరిమితి 18 ఏళ్ల నుంచి 30లోపు ఉండాలన్నారు. శివాజీనగర్‌లోని ఎప్లాయ్‌మెంట్‌ కార్యాలయంలో ఉద్యోగమేళాలో పాల్గొనాలన్నారు. వివరాలకు 95817 68413, 99487 48428, 99487 48428, 99594 56793 ఫోన్‌ ద్వారా సంప్రదించాలన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ తొలగింపు



నిజామాబాద్‌ అర్బన్‌: జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ ఆరుట్ల రాజేశ్వర్‌ను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రంథాల చైర్మన్లను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేయగా అందులో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ కూడా ఉన్నారు. ఈయన 28 నెలల పాటు గ్రంథాలయ చైర్మన్‌గా కొనసాగుతూ వచ్చారు.

క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్‌ రాష్ట్ర జట్టు మేనేజర్‌గా శ్రీనివాస్‌



శ్రీనివాస్‌

కామారెడ్డి అర్బన్‌: బిహార్‌లో ఈనెల 15 నుంచి నిర్వహించే జాతీయ స్థాయి క్రాస్‌ కంట్రి చాంపియన్‌షిప్‌ పోటీలకు రాష్ట్ర జట్టు మేనేజర్‌గా రాజంపేట మండలం కొండాపూర్‌ ఉన్నత పాఠశాల పీఈటీ శ్రీనివాస్‌ ఎంపికయ్యారు. అనంతరం శ్రీనివాస్‌ను జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌ అభినందనలు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలపై దాడి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ: పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఉపాధ్యాయుడు మత బోధన చేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం బీజేపీ, ఏబీవీపీ, భజరంగ్‌దళ్‌ నాయకులు స్కూల్‌పై దాడి చేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఇంటికి వచ్చి మా పాఠశాలలో మత బోధన చేస్తున్నారని విద్యార్థి తన తండ్రికి చెప్పడంతో విద్యార్థి తండ్రి వీడియో తీసి సోషల్‌ మీడియాలో పెట్టారు. దీంతో బీజేపీ, ఏబీవీపీ, భజరంగ్‌ దళ్‌కు చెందిన పలువురు పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ మహేందర్‌రెడ్డి ఆందోళన చేస్తున్న వారిని పంపించారు. పాఠశాలపై దాడి చేసిన వారిపై స్కూల్‌ హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బొలేరో బోల్తా

- ప్రమాదంలో ఒకరి మృతి
- ముగ్గురికి తీవ్రగాయాలు



మాచారెడ్డి: ఓ స్కూటీని వెనుక నుంచి ఢీ కొని తప్పించే క్రమంలో బొలేరో వాహనం బోల్తాపడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని పాల్వంచ మర్రి వద్ద చోటు శనివారం చేసుకొంది. ఎస్సై శ్రీనివాస్‌ గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన రాజేశ్వర్‌ ఆయన కూతురు అక్షిత‌లు ఇటీవల కొనుగోలు చేసిన స్కూటీకి చుక్కాపూర్‌ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో పూజ చేయించుకుని కామారెడ్డికి వెళ్తున్నారు. అదే సమయంలో ఓ బొలేరో వాహనం వెనుకనుంచి స్కూటీని ఢీకొన్నది. దీంతో కిందపడ్డ తండ్రి కూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. బొలేరో డ్రైవర్‌ సతీశ్‌ అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో భవానిపేట వైపు వాహనాన్ని వేగంగా నడిపాడు. దీంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సతీశ్‌ పక్క సీట్లో కూర్చున్న యూపీకి చెందిన నిగ్‌ పాల్‌(40) అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి భాను ప్రకాశ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.